
# పెళ్లి కుదిరింది

కోలపల్లి ఈశ్వర్



**త**లుపు మీద ఎవరో దబదబా బాదుతున్న శబ్దం...

"ఆదివారం...హాయిగా ఓ గంటసేపు ఎక్కువగా నిద్ర పోదామనుకుంటే... బంగారం లాంటి నిద్రను పాడు చేశారు...ఛ..." అనుకుంటూ మంచం మీద నుంచి లేచి తూలుతూ వెళ్ళి తలుపు తీశాడు హరిబాబు.

ఎదురుగా ఇంటి ఓనర్ ఏకాంబరం.

"ఏంటి సార్ ఇలా వచ్చారు?...అద్దె డబ్బులు, నిన్ననే ఆంటీకి ఇచ్చేశానే..." అంటూ వెనక్కి తిరిగాడు హరిబాబు.

"అది సరే..నీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి" అంటూ చొరవగా లోనికి వచ్చి కుర్చీలో కూర్చున్నాడాయన.

"ఏమిటో..." అంటూ మంచం మీద కూలబడ్డాడు హరిబాబు మత్తుగా.

"నువ్వెవరో అమ్మాయిని ప్రేమిస్తున్నావని విన్నాను...నిజమేనా...?" సీరియస్‌గా చూశాడు ఏకాంబరం.

"ఎవరైనా అబ్బాయిలు అమ్మాయిల్నే ప్రేమిస్తారు గానీ, నేనింకా అందులోకి దిగలేదు. ఇంతకూ ప్రొద్దున్నే తలుపు తట్టి పిలిచి...ఇదేం ప్రశ్న సార్?" చిరాగ్గా అన్నాడు హరిబాబు.

"మా అమ్మాయి సువర్చలపై నీ అభిప్రాయం ఏమిటి?"

"ఏముంది...సువర్చల మీ అమ్మాయి..." హరిబాబు ఆవులిస్తూ అన్నాడు నోటికి చెయ్యి అడ్డం పెట్టుకుంటూ.

"జోకులు నాకు నచ్చవు...సీరియస్‌గా మాట్లాడుకుందాం...సువర్చల అందంగా ఉంటుందా?"

'ఏం...టీవీలోనో, సినిమాలోనో నటిగా చేద్దామనుకుంటున్నారా? లేక ఈ మధ్య అందాల పోటీలు ఎక్కువయ్యాయ్... వాటికి పంపటానికి ప్రయత్నాలేమన్నా చేస్తున్నారా...?"

"లేదు. నీకిచ్చి పెళ్ళి చేద్దామనుకుంటున్నాను..."


అదిరి పడ్డాడు హరిబాబు. ఇలాంటి వింత సంఘటనలు నిజ జీవితంలోనూ జరుగుతాయని అతనేనాడూ వూహించలేదు. ఒక ఆడపిల్ల తండ్రి డైరెక్ట్‌గా ఒక అబ్బాయి వద్దకు వచ్చి తన కూతుర్నిచ్చి పెళ్ళి చేస్తాననంటాడా? అయినా తప్పేముందిలే! తను వయసులో..అందులో అందంగానే వున్నాడు. పైగా సంపాదనాపరుడు. ఆయనలా అడగడంతో అనహాజత్వమేముందని అనుకున్నాడు మళ్లీ.

"ఏమిటి మాట్లాడవ్?" హూంకరించాడు ఏకాంబరం.

"సడెన్‌గా వచ్చి అలాగంటే

## అమ్మ కూచిని కాను!

కొంటె నవ్వుల త్రిష అమ్మ మాట జవదాటదని, నిత్యం ఆమెని వెంటేసుకుని ఆమె చెప్పిన దానికి కాదనకుండా తలాడించేస్తుందని సినీ పరిశ్రమలో అందరూ చెప్పుకుంటుంటారు. ఈ విషయం త్రిష దగ్గర కదిపితే "నేనేం చిన్న పిల్లను కాదు కదా! ఏమీ ఆలోచించకుండా ఆమె చెప్పినదానికి ఎలా తలాడించేస్తాను? కాకపోతే మనకన్నా పెద్దవాళ్ళు, అనుభవజ్ఞులు కాబట్టి మన మంచి కోరి ఏదైనా చెబితే కాదనకుండా ఉండగలమా?" అంటూ చిన్నబుచ్చుకుంది తన అందమైన ముఖారవిందాన్ని. అంతలా చెబితే మనం మాత్రం కాదంటామా?



ఎలాగండీ? పెళ్ళా? మజాకా?" అన్నాడు ధైర్యంగా.

"ఆ విషయం నువ్వు నాకు చెప్పక్కర్లేదు. ముందు చెప్పు ఏమంటావ్?"

"మీ అమ్మాయి గురించి నాకలాటి అభిప్రాయమేదీ లేదు. ఇంకేం చెప్పేది?"

"ఇప్పటిదాకా లేకపోవచ్చు. ఇప్పుడు ఏర్పరచుకో. సువర్చల నిన్ను ప్రేమిస్తున్నది. దాని కోరిక తీర్చడం నా ధర్మం."

"ఇదెక్కడి గోలండీ! అంతా మీ ఇష్టమేనా? నాక్కొన్ని ఆశయాలున్నాయ్. నా దృష్టిలో వేరే అమ్మాయిలున్నారు" అన్నాడు హరిబాబు మొండిగా.

"సువర్చలకు మాత్రం నువ్వే నచ్చావ్. మర్యాదగా దాన్ని ప్రేమించు" కటువుగా చెప్పాడు ఏకాంబరం.

"ఏంటండీ! దౌర్జన్యమా?"

"అవును. మాట వినకపోతే పర్యవసానం తీవ్రంగా ఉంటుంది. మా అబ్బాయి అసలే మంచోడు కాదు. వాడికి రౌడీ గ్యాంగ్ వుంది. నువ్వు సువర్చలని ప్రేమించానని చెప్పి, అంతలోనే ప్లేటు ఫిరాయిస్తున్నావని చెబుతాను. దాంతో నీ కాలో, చేయో నీది కాకుండా పోతోంది" హెచ్చరించాడు ఏకాంబరం.

హరిబాబుకు కళ్లు తిరిగినట్టయింది ఈ మాటతో. భయంతో వెన్నుపూస జలదరించింది.

ఇదెక్కడి పీడరా బాబూ! వీడిలా తగులుకున్నాడేమిటి? అయినా సువర్చలంటే తన కస్సలు ఇష్టం లేదు. అమ్మాయి బాగానే ఉంటుంది. కానీ రఫ్. ఏ విషయంలోనూ మొహమాటం, సిగ్గు, దాపరికం అనేవి అస్సలు లేవు. అందర్నీ విమర్శిస్తుంది. అబ్బాయిల్నీ, అమ్మాయిల్నీ సమానంగా దుయ్యబడుతుంది. తనకు నచ్చని వాళ్లెవరైనా సరే...వారిని చెడామడా తిట్టి పారేస్తుంది. ఇంకా ఘోరం ఏమిటంటే తనకి కొన్ని బూతు పదాలు ఉపయోగించడం కూడా అలవాటు...

అలాంటమ్మాయిని చేసుకుంటే ఇక తన పని అవుట్. మనశ్శాంతి కోల్పోయి పిచ్చివాడిగా మారి వీధిన పడాల్సిందే.

కానీ ఇప్పుడీ ముసలాడేమో...ఏకంగా తనకు వార్నింగ్ జారీ చేస్తున్నాడు.

వీడు చెప్పేది కూడా అబద్ధమేమీ కాదు. వీడి కొడుకు అదో టైపు. విలన్‌లాగా గుచ్చి గుచ్చి చూస్తుంటాడు. అందుకే వాడెదురుపడ్డపుడల్లా తల వంచుకుని తప్పించుకుపోతుంటాడు తను.

"ఓయ్...ఏంటీ నిద్దరోతున్నావా? చెప్పింది అర్థమైందా?..మరోసారి చెప్పాలా?" తీక్షణంగా చూశాడు ఏకాంబరం.

"అది కాదు సార్...మరీ..."ఏదో చెప్పబోతుంటే ఠక్కున లేచి ముందుకడుగువేసి అతని మొహంకేసి తన చూపుడు వేలుని చూపిస్తూ..."ఇంకేం చెప్పాలని ప్రయత్నించకు. నేను వినను. మా అబ్బాయి మాత్రం నా మాట తప్పక వింటాడు. వారం రోజుల్లోగా మా అమ్మాయిని ప్రేమించు. నెలరోజుల్లోగా నీ పెళ్లి నేను చేస్తాను. తేడా వచ్చిందంటే...ఫిజికల్లీ హ్యాండీకాప్డ్ అయిపోతావ్..." అనేసి విసవిసా బయటికెళ్లిపోయాడు ఏకాంబరం.

కొయ్యబారిపోయి చూస్తుండిపోయాడు హరిబాబు.

* * *

"హరీ...నాన్నా...హరీ..."

కళ్లు తెరిచి చూశాడు హరిబాబు. తన ప్రక్కనే కూర్చుని ఆదుర్దాగా తన నుదుటిపై చేయి వేసి తనకేసే ఆందోళనగా చూస్తోంది తన తల్లి.

"అమ్మా..."

అంటూ శక్తి కూడదీసుకుని లేవబోయాడు.

"ఆc..ఆc..లేవబాకు. పడుకో..." వారించింది సుందరమ్మ.

"నువ్వు...ఇలా...."ఏదో అడగబోయాడు.

"నీకు మూడు రోజులుగా ఒంట్లో బాగా లేదని, జ్వరంతో మూలుగుతున్నావనీ...నీ ఫ్రెండు రాజేష్ ఫోన్ చేశాడు. వెంటనే బయల్దేరి వచ్చాను. ఆ అబ్బాయి దగ్గరుండి అన్నీ చూసుకుంటున్నాడటగా..." అందామె.


అవునన్నట్లు తల వూపాడు.


"సరే నేనొచ్చాగా...ఇంక దిగులు పడకు..." అంది లేచి వంటగదికేసి నడుస్తూ.

గట్టిగా ఊపిరి పీల్చుకుని 'ఊc' అంటూ మూలిగి నిద్రలోకి జారుకున్నాడు హరి.

రెండు రోజులు గడిచాయి.

సుందరమ్మ సపర్యలతో తిరిగి మామూలు మనిషయ్యాడు హరిబాబు. కానీ నీరసం మాత్రం పోలేదు. సాయంత్రం ఇంటి ముందు కుర్చీ వేసుకుని కూర్చుంటే ఏకాంబరం





అదోమాదిరిగా తన వైపే చూస్తూ వెళ్లడం గమనించకపోలేదతను.

వెంటనే ఒంట్లో వున్న ఆ పాటి శక్తి కూడా పోతున్నట్లనిపించింది. వెంటనే లేచి లోనికి వెళ్లి మంచంపై పడుకున్నాడు.

కొద్దిసేపు కళ్లు మూసుకుని ఆలోచించి... ఒక నిర్ణయానికి వచ్చిన వాడిలా "అమ్మా" అని పిలిచాడు.

'ఆఁ' అంటూ లోపల నుంచి వచ్చి అతని ప్రక్కన కూర్చుంది సుందరమ్మ.

"ఏమిట్రా...ఏమనిపిస్తోంది? బత్తాయి రసమేమైనా ఇవ్వమంటావా?" అని అడిగింది అతని భుజంపై చేయి వేసి.

"అమ్మా...నీతో ఒక మాట చెప్పాలి" అన్నాడు.

"చెప్పు బాబూ!" అంది ఆప్యాయంగా.

"నేను...నేను...మామయ్య కూతురు నీలిమని పెళ్లి చేసుకుంటానే..." అన్నాడు ఎటో చూస్తూ.

సుందరమ్మ ముఖం ఆనందంతో వికసించింది.

"అబ్బ..ఎంత చల్లని మాట చెప్పావురా కన్నా...అలాగే...అలాగే. వెంటనే మామయ్యకి కబురు చేస్తాను. వచ్చే నెల్లో మంచి రోజులున్నాయి..." అందామె సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బవుతూ.

తల్లి ముఖంలో వచ్చిన కాంతిని చూసి కళ్ళు మూసుకుని నిట్టూర్చాడు హరిబాబు.

ఇప్పుడేం చేస్తాడు ఆ ఏకాంబరం? వాడు పిచ్చి పిచ్చిగా ఏదైనా కూస్తే... వాయించి పారేస్తుంది అమ్మ. అమ్మతో పెట్టుకుంటే అంతే సంగతులు. అసలే సంవత్సరం నుంచి నీలిమని చేసుకోవడానికి ఒప్పుకోమంటూ అడిగీ అడిగీ ప్రాణాలు తీస్తోంది. ఇన్నాళ్లకి తను ఒప్పుకున్నాడు. ఇంక సువర్చల గురించి ఆ ఏకాంబరం మాట్లాడ్డానికొచ్చాడా...వాడి దుంప తెంచడం ఖాయం అనుకున్నాడు హరిబాబు.

## యువరాజ్ లేకుండానే...

యువరాజ్‌సింగ్ లేకుండానే ఈసారి కిమ్‌శర్మ తన బర్త్‌డే పార్టీ జరుపుకుంది. సునామీ కారణంగా పెద్ద పార్టీ జరుపుకోలేవడం లేదని కిమ్ చెప్పినా, ఆమె దగ్గరి బంధువులు, స్నేహితులతో ముంబాయి హోటల్ ఓ రాత్రి వెలిగిపోయిందన్నది మాత్రం సత్యం. యువరాజ్ గురించి అడగబోయేంతలోనే గడిచిపోయిన దాన్ని గురించి మాట్లాడ్డం నాకిష్టముండదంటూ తప్పించుకుంది.

ఏదేమైతేనేం...ఆ డాషింగ్ అండ్ డేరింగ్ సువర్చల కన్నా నీలిమే కొంత మెరుగు. అసలు నీలిమకన్నా గొప్ప అమ్మాయి దొరుకుతుందేమోనని ఇన్నాళ్లూ తల్లి మాటలను తిరస్కరిస్తూ వచ్చాడు కానీ నీలిమ నచ్చలేదని కాదు.

హరిబాబుకు మళ్లీ ఫ్యాక్టరీకి వెళ్తున్నాడు.

సుందరమ్మ ఊరెళ్లిపోతానంటే మరోవారం రోజులాగమన్నాడు హరిబాబు. ఏకాంబరం నుంచి ఏం ముప్పు ఎదురవుతుందోననే సందేహంతో.

కానీ ఏకాంబరం హరిబాబు జోలికి రాలేదు మళ్లీ. బహుశా తన తల్లిని చూసి భయపడివుంటాడనుకున్నాడు.

రోజులు గడిచిపోతున్నాయి.

సుందరమ్మ ఊరెళ్లి తన తమ్ముడు గవరయ్యని కలిసింది. హరిబాబు పెళ్లికి ఒప్పుకున్నాడని తెలిసి ఎంతో ఆనందించిన గవరయ్య వెంటనే పురోహితుడిని రప్పించి ముహూర్తాలు పెట్టించాడు. అంతా అనుకున్నట్లే జరిగింది.

సరిగ్గా నెల రోజుల తర్వాత హరిబాబుకి నీలిమతో పెళ్లి నిశ్చయమైపోయింది.

పెళ్లి రోజు...

ఫంక్షన్ ప్యాలెస్‌లో అంతా హడావిడిగా వుంది. బంధువులు, స్నేహితులు, వచ్చేవాళ్లూ, పోయేవాళ్లతో అంతా బిజీగా వుంది.

తన ముఖ్యమైన ఫ్రెండొకరు ఇంకా రాలేదని గమనించిన హరిబాబు అతనికి ఫోన్ చేద్దామని మేనేజర్ రూమ్ వైపుకు వెళ్తున్నాడు. అంతలో తన తల్లి, ఇంటి ఓనరు ఏకాంబరం ఏదో మాట్లాడుకుంటుండడం గమనించి, అనుమానంతో ప్రక్కనే వున్న క్రోటన్ చెట్ల వెనకాల చేరి వారి మాటలు ఆలకించసాగాడు.

"ఎంతయినా మీ మేలు ఈ జన్మలో మరచిపోలేనన్నయ్యా...ఏదో విధంగా మా వాడు ఈ పెళ్లికి ఒప్పుకునేలా చేశారు" అంటోంది సుందరమ్మ.

"నూరబద్ధాలు ఆడైనా ఒక్క పెళ్లి చేయాలని అన్నారు పెద్దలు. నేను ఒక్క అబద్ధం ఆడి మీ అబ్బాయి పెళ్లి చేశాను. ముఖ్యంగా మీ బాధ చూడలేక...ఈ రిస్కు తీసుకోవాల్సి వచ్చింది. కానీ ఇప్పుడు నాకు భయంగా ఉందమ్మా..." అన్నాడు ఏకాంబరం.

"ఏంటన్నయ్యా అది?" అందావిడ కంగారుగా.

"ఈ నాటకంలో మా సువర్చల పేరు వాడుకున్నాను. తనగ్గానీ ఈ నిజం తెలిసిందో...నా భరతం పట్టక మానదు" అన్నాడాయన నవ్వుతూ.

ఇదంతా విన్న హరిబాబుకి కోపంతో ఒళ్లు మండిపోయింది. వీళ్లిద్దరూ కలిసి తనని ఎంత సులభంగా ఫూల్‌ని చేశారు అనుకొని పళ్లు కొరికాడు.

కానీ ఏం లాభం! అంతా అయిపోయింది కదా!

అయినా నష్టమేం జరిగింది కనుక! నీలిమ తనకు తగిన భార్యే అనడంలో సందేహం లేదు. అయినా వీళ్లనొక ఆట ఆడించాలి అనుకుంటూ చటుక్కున చెట్ల చాటు నుంచి ముందుకు వచ్చి ఏకాంబరంతో అన్నాడు "సువర్చలతో అసలు సంగతి నేను చెబుతాను సార్!"

షాక్ తిన్న ఏకాంబరం "వద్దు నాయనోయ్!...ఏదో తప్పు చేశాను. నన్ను క్షమించు" అంటూ హరిబాబు చేతులు పట్టుకున్నాడు. ❋